నమస్తే తెలంగాణ
వికారాబాద్
I హైదరాబాద్, మంగళవారం 21 జనవరి 2025 VIKARABAD



మీర్‌పేటలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి చిత్రంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి తదితరులు

# రేవంత్ హామీలన్నీ నీటి మూటలే..

## ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, జనవరి 20: సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నీటి మూటలుగానే మిగిలిపోతున్నాయని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో అభివృద్ధి పనులకు ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డితో కలిసి సోమవారం ఆమె శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ రూ.5.41కోట్ల నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా దాటవేతధోరణి అవలంబిస్తున్నదన్నారు. ప్రజా పాలన దరఖాస్తులను మూలకు పడేసి.. మరోసారి రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని చెప్పడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, రేషన్ కార్డుల కోసం వేర్వేరుగా సర్వేలు చేయడం ఎందుకన్నారు. సర్వేల పేరుతో కాలయాపన చేయడానికి ప్రభుత్వం ఆడుతున్న నాటకమన్నారు. అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేశారని చెప్పారు. ప్రతి ఇంటికి మంచి నీళ్లు అందించేందుకు మిషన్ భగీరథ ద్వారా రూ.370 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా నిధులు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కమిషనర్ జ్ఞానేశ్వర్, కార్పొరేటర్లు భిక్షపతి చారి, అనిల్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# లాఠీలు పక్కన పెట్టి.. బ్యాట్‌లు చేతపట్టి..

## రాచకొండ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించిన సీపీ సుధీర్‌బాబు



మైదానంలో బౌలింగ్ చేస్తున్న సీపీ సుధీర్‌బాబు

పెద్దఅంబర్‌పేట, జనవరి 20: ఫిర్యాదు తీసుకోండి.. ఎఫ్ఐఆర్ చేయండి.. కేసు దర్యాప్తు చేయండి.. నిందితులను పట్టుకోండి.. విచారణ జరపండి.. ప్రమాదాలు జరిగితే క్షతగాత్రులను కాపాడేందుకు పరుగులు తీయాలి.. ప్రజాప్రతినిధులు వస్తే బందోబస్తుకు వెళ్లాలి.. ఇవీ నిత్యం పోలీసుల నోట వినిపించే మాటలు.. కానీ, వీటన్నింటికి భిన్నంగా.. ఫోర్ కొట్టండి.. క్యాచ్ మిస్ కావొద్దు.. బౌలింగ్ బాగా చేయాలి.. మనమే గెలవాలి.. అనే మాటలు వినిపించాయి. చప్పట్లు కొడుతూ మైదానంలో పోటీపడ్డారు పోలీసులు. రాచకొండ పోలీస్ ఆరో వార్షిక స్పోర్ట్స్, గేమ్స్ మీట్ కార్యక్రమాన్ని సోమవారం మున్సిపాలిటీ పరిధి కుంట్లూరులోని సీఎన్ఆర్ గ్రౌండ్‌లో నిర్వహించారు. రాచకొండ కమిషనర్ జీ సుధీర్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. సరదాగా బౌలింగ్ చేశారు. శాంతిభద్రతల పరిరక్షణకు నిత్యం పరుగులు తీసే పోలీసులు మైదానంలో పోటీ పడ్డారు. బ్యాటు, బాల్ చేతపట్టుకుని ఉత్సాహంగా ఆటలు ఆడారు.

# మిస్సింగ్ కేసులంటే అలుసా?

- అంతగా దృష్టిపెట్టని పోలీసులు
- సమన్వయం లోపంతో మరింత నష్టం
- అనేక ఠాణాల్లో ఇదే పరిస్థితి
- పోలీసుల తీరుపై తీవ్ర విమర్శలు

సిటీబ్యూరో, జనవరి 20 (నమస్తే తెలంగాణ): మిస్సింగ్ కేసుల పట్ల ట్రై పోలీస్ కమిషనరేట్ పోలీసులు నిర్లక్ష్యం చూపుతున్నారన్న విమర్శలొస్తున్నాయి. ఒక వ్యక్తి అదృశ్యమయ్యాడంటూ ఫిర్యాదు చేసిన తరువాత అతని ఆచూకీ తెలిసిందా? ఎక్కడకు వెళ్లాడు..? అనే విషయాలు తెలుసుకోవడానికి కుటుంబ సభ్యులు చెప్పులు అరిగేలా పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగాల్సిన పరిస్థితి నెలకొంటున్నది. మిస్సింగ్ అయిన వారి వయస్సును బట్టి పోలీసులు ఒక అంచనాకు వచ్చి దర్యాప్తు జరుపుతుంటారు. అయినా కూడా వారి అంచనాలు తారుమారవుతూ సరైన సమయంలో స్పందించకపోవడంతోనే మిస్సింగ్ అయిన వారు శవాలుగా తేలడం వంటి ఘటనలు కూడా జరుగుతుంటాయి. అయినా కూడా పోలీసుల్లో మార్పు రావడం లేదు. మిస్సింగ్ కేసు అంటేనే తేలికగా తీసుకునేవారు చాలా మంది ఉన్నారు. దీనికి తోడు పోలీస్‌స్టేషన్ల మధ్య సమన్వయం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఒకే పోలీస్‌స్టేషన్‌లో సెక్టార్ల వారీగా కూడా సమన్వయం లేని పరిస్థితి నెలకొన్నది. ఇలాంటి పరిస్థితుల్లో ఠాణాలు, డివిజన్లు, జోన్లు, కమిషనరేట్ల మధ్య సమన్వయం ఎలా ఉంటుందో అట్టే అర్థమవుతున్నది. మిస్సింగ్ కేసుల్లో అన్ని కేసుల్లోనూ వేగంగా స్పందించాల్సిన అవసరముంటుంది. బాధితుల సెల్ ఫోన్లు, సీసీ కెమెరాలను బట్టే కేసును ఛేదించే పోలీసులు, ఈ విషయాలపై కూడా దృష్టి పెట్టకుండా పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధిత కుటుంబసభ్యులను తిప్పి పంపిస్తున్న ఘటనలు జరుగుతున్నాయి.




### 15 రోజుల కిందట..

నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో 15 రోజుల కిందట ఒక వ్యక్తి మిస్సింగ్ అయ్యాడంటూ కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. అయితే మిస్సింగ్ అయిన వ్యక్తి గురించి అక్కడి పోలీసులు ఏ మాత్రం పట్టించుకున్న దాఖలాలు లేవు. కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరిగినా.. ఇంకా దొరకలేదనే సమాధానమే వస్తున్నది. మీ కేసు చూసే ఎస్సై లేడు.. 15 రోజులు పడుతుంది... చూద్దామంటూ పెద్దసార్ల సమాధానం.. ఇలా రద్దీగా ఉండే నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసులంటే చాలా లైట్‌గా తీసుకుంటున్నారు.


### భార్య కనిపించడం లేదంటూ..

తన భార్య కన్పించడం లేదంటూ పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, మరుసటి రోజు మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక మహిళ మృతదేహం లభించిందని, 4న ఈ విషయం పంజాగుట్ట పోలీసులు గుర్తించారని ఇటీవల సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఓ జర్నలిస్ట్ తన ఆవేదనను వ్యక్తం చేశారు. ఫిర్యాదు చేయగానే పోలీసులు రంగంలోకి దిగి ఉండాల్సిందని, పక్క పోలీస్‌స్టేషన్ పరిధిలో మృతదేహం బయటపడిందంటే ఆ సమాచారం కూడా సేకరించలేని పరిస్థితుల్లో ఉన్నారని ఆరోపించారు. ఒక మిస్సింగ్ కేసు వచ్చిందంటే.. ట్రై పోలీస్ కమిషనరేట్ల పరిధిలో మృతదేహాలు బయటపడితే కనీసం ఏమి జరిగిందో తెలుసుకునే ప్రయత్నం చేస్తారు. కానీ పంజాగుట్ట పోలీసులు ఆ పనిచేయడం లేదని విమర్శలు వచ్చాయి. పోలీసుల నిర్లక్ష్యంతో మూడు రోజులుగా ఒక మృతదేహం మార్చురీలో అనాథశవంగా పడి ఉందంటూ మృతురాలి కుటుంబసభ్యులు తమ ఆవేదన వ్యక్తం చేశారు.

### రోడ్డు ప్రమాదంలో చనిపోతే..

ఏడాది కిందట చాదర్‌ఘాట్ ఠాణాలో శ్రావణ్ కుమార్ అనే యువకుడు కనిపించడం లేదంటూ అతడి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. అయితే అదే యువకుడు అదే పోలీస్‌స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదానికి గురై.. మృతి చెందాడు. అతడి మృతదేహాన్ని గుర్తుతెలియనిదిగా భావించి.. ఉస్మానియా మార్చురీకి తరలించారు. అయితే యువకుడి తల్లిదండ్రులు కొడుకు ఫొటో పట్టుకొని 20 రోజుల పాటు పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండా పోయింది. ఎక్కడ పోతాడమ్మ వస్తాడంటూ స్టేషన్‌కు వచ్చిన తల్లిదండ్రులతో ఒక రకంగా పోలీసులు మాట్లాడి పంపించేవారు. పోలీసులపై నమ్మకం లేక తల్లిదండ్రులే నగరంలో తెలిసిన చోట వెతికారు. ఇలా తిరుగుతున్న క్రమంలోనే ఉస్మానియా మార్చురీకి కూడా వెళ్లి పరిశీలిస్తే.. కొడుకు మృతదేహం కనిపించింది. ఈ విషయాన్ని పోలీసులకు చెప్పడంతో కంగుతిన్నారు. తమ పోలీస్‌స్టేషన్ పరిధిలోనే రోడ్డు ప్రమాదానికి గురైన వ్యక్తి, మిస్సింగ్ అయిన వ్యక్తి ఒకరే కావడంతో పోలీసులు కూడా తమ నిర్లక్ష్యాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేశారు. పోలీసుల నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతూ బాధితుల కుటుంబ సభ్యులు ఠాణా ముందే ఆందోళనకు దిగారు.

# నేటి నుంచి గ్రామ సభలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, జనవరి 20 : నేటి నుంచి 24 వరకు గ్రామ సభలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని, అందుకు తగిన ఏర్పాట్లను చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. అదనపు కలెక్టర్లు సుధీర్, లింగ్యానాయక్‌లతో కలిసి సోమవారం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. లబ్ధిదారుల ఎంపిక అనేది నిరంతర ప్రక్రియ అన్నారు. సమావేశంలో డీఆర్డీవో శ్రీనివాస్, డీపీవో జయసుధ, డీఎస్‌వో మోహన్‌బాబు, పీడీ హౌసింగ్ కృష్ణ, వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### భూమి ఉన్నదని కార్డు కట్ చేశారు..



వ్యవసాయ భూమి ఉన్నదని రేషన్ కార్డు కట్ చేశారు. రేషన్ కార్డు కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నా. అయినా అధికారులు స్పందించ లేదు. తమది ఉమ్మడి కుటుంబం. అన్నదమ్ములు భూమి పంపకాలు చేస్తే, తమకు ఐదు ఎకరాల్లోపు వస్తుంది. అధికారులు స్పందించి న్యాయం చేయాలి.

– పండరీనాథ్, శ్యామప్ప, ఉద్దండాపూర్, (తాండూరు రూరల్)

### హామీలిచ్చి కొర్రీలు పెట్టుడేంది..



ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఎన్నో హామీలిచ్చి అధికారంలోకి వచ్చింది. పథకాల అమలులో మాత్రం కొర్రీలు పెడుతున్నది. రేషన్ కార్డు కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నా. లిస్టులో పేరు రాలేదు. కుటుంబంలో నలుగురం ఉన్నాం. రేషన్ కార్డు మంజూరు చేయాలి..

– బంగారి రమేశ్, రావులపల్లి, మర్పల్లి మండలం

### పూటకో మాట మాట్లాడుతుండ్రు..



కాంగ్రెస్ పార్టీ మంత్రులు, నాయకులు పూటకో మాట మాట్లాడుతుండ్రు. అర్హులందరికీ రేషన్ కార్డులు ఇస్తామని చెప్పి కిరికిరి పెడుతుండ్రు. ప్రజాపాలన, కుటుంబ సర్వేలో రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నం. లిస్టులో పేరు రాలేదు. అధికారులను అడిగితే పొంతనలేని సమాధానం చెబుతుండ్రు.

– రాజు, బషీరాబాద్

# సగం మందికే.. సంక్షేమం..!




- అర్హులకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్ సర్కార్
- రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకున్నా..
- సర్వే జాబితాలో కనపడని పేరు
- మా పేరెందుకు లేదంటూ అధికారులను నిలదీస్తున్న జనం
- కొత్త రేషన్ కార్డుల కోసం వికారాబాద్ జిల్లాలో 23 వేలు, రంగారెడ్డి జిల్లాలో 83 వేల దరఖాస్తులే వచ్చాయంటూ అధికారుల లెక్కలు
- ప్రజాపాలన దరఖాస్తులను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం
- తుది జాబితా ఎంపికపై నీలినీడలు
- ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో నిరంతర ప్రక్రియ అంటూ దాటవేత
- రైతు భరోసాలోనూ వేల ఎకరాలకు కోత
- నేటి నుంచి గ్రామసభల్లో ఆయా పథకాల అర్హుల జాబితా వెల్లడి

*కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులకు అన్యాయం చేస్తూ వస్తున్నది. సబ్బండ వర్ణాలకు హామీలనిచ్చిన ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో కోత విధిస్తూ అర్హులకు సంక్షేమ ఫలాలు దక్కకుండా వ్యవహరిస్తున్నది. ఇప్పటికే రూ.2 లక్షల్లోపు రుణమాఫీ అంటూ అర్హులైన లక్ష మంది రైతులకు అన్యాయం చేసింది. రేషన్ కార్డుల జారీ, రైతు భరోసా, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి లబ్ధిదారుల జాబితాను నేటి నుంచి గ్రామ సభల్లో వెల్లడించనున్నారు. ప్రధానంగా రేషన్ కార్డుల జారీపై గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఇంటింటి సర్వే చేసి, ప్రజాపాలనతో పాటు మీసేవ, ఆన్‌లైన్ ద్వారా జనం దరఖాస్తులు చేసుకున్నారు. అయితే వికారాబాద్ జిల్లాలో 23 వేలు, రంగారెడ్డి జిల్లాలో 83 వేల దరఖాస్తులే వచ్చాయని అధికారులు పేర్కొంటుండడం బాధాకరం. అర్హుల పేర్లు రేషన్‌కార్డు జాబితాలో లేకపోవడంతో కోత విధించే ప్రక్రియలో భాగమా అన్నదానిపై ప్రజల నుంచి అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మా పేర్లు సర్వే జాబితాలో ఎందుకు లేవంటూ అర్హులు అధికారులను నిలదీయడంతో వారు జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అప్రమత్తమైన యంత్రాంగం రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అంటూ పత్రికా ప్రకటన విడుదల చేసి దాటవేయడం బాధాకరం. దరఖాస్తు చేసుకున్నవారిలో సగం మందికి ఎగనామం పెట్టేందుకే కోత విధించేలా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని ప్రచారం జరుగుతున్నది.*

*– వికారాబాద్, జనవరి 20 (నమస్తే తెలంగాణ)*

## రంగారెడ్డి జిల్లాలో 83 వేల దరఖాస్తులే పరిశీలన..

జిల్లాలో కొత్త రేషన్ కార్డుల కోసం లక్షలాది దరఖాస్తులు వచ్చాయి. మీసేవ ద్వారా 44,400, కుటుంబ సభ్యులను చేర్చేందుకు 1.36 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ప్రజాపాలన ద్వారా జిల్లాతో పాటు గ్రేటర్‌లో ఉన్న ప్రాంతాల నుంచి సుమారు 5.50 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ఇప్పటి వరకు 83 వేల దరఖాస్తులను మాత్రమే పరిశీలించి, మిగతా దరఖాస్తులను అటకెక్కించడంతో దరఖాస్తుదారుల్లో అయోమయం నెలకొంటున్నది. జిల్లాలో సమగ్ర కుటుంబ సర్వే పూర్తి స్థాయిలో జరుగలేదు. కొంత మంది ఇండ్లకు స్టిక్కర్లు కూడా అంటించలేదని ప్రజలు పేర్కొంటున్నారు. కొత్త రేషన్ కార్డులు వస్తాయా.. రావా.. అని జనం ఆందోళన చెందుతున్నారు. సమగ్ర కుటుంబ సర్వే ద్వారా సేకరించిన వివరాల ప్రకారం.. కారు, పెద్ద పెద్ద భవనాలు, ఇంట్లో ప్రభుత్వ ఉద్యోగి ఉంటే రేషన్ కార్డులు ఇవ్వొద్దన్న ఆంక్షలు కూడా ఉన్నట్లు తెలుస్తున్నది. పథకాల అమలులో కోతలు విధిస్తుండడంతో జిల్లావాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## వికారాబాద్ జిల్లాలో రైతు భరోసాలోనూ 30 వేల ఎకరాలకు కోత..

కాంగ్రెస్ ప్రభుత్వం లేనిపోని కొర్రీలు పెట్టి రైతు భరోసాలోనూ కోత విధించాలని చూస్తున్నది. ఇందులో భాగంగా జిల్లా యంత్రాంగం అర్హులను తగ్గించింది. జిల్లావ్యాప్తంగా 12.35 లక్షల ఎకరాల్లో వ్యవసాయ భూములున్నాయి. బీఆర్‌ఎస్ హయాంలో 6.20 లక్షల ఎకరాల వరకు రూ.300 కోట్లకుపైగా రైతు బంధు సాయాన్ని అందజేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం 5.80 లక్షల ఎకరాలకు మాత్రమే రైతు భరోసా అందించేందుకు జాబితాను సిద్ధం చేసింది. దీంతో దాదాపు 30 వేల ఎకరాలను తగ్గించి రైతుల ఉసురు పోసుకుంటున్నది. ఏడాదికి రూ.15 వేల పెట్టుబడి సాయాన్ని అందజేస్తామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం రూ.12 వేలే ఇస్తామంటూ మాట మార్చడంతో రేవంత్ సర్కార్‌పై రైతులు దుమ్మెత్తిపోస్తున్నారు.



### ప్రజలను కాంగ్రెస్ మోసం చేస్తున్నది..



కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను పక్కనపెట్టి ప్రజలను మోసం చేస్తున్నది. రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకుంటే జాబితాలో పేరు రాలేదు. మా నాన్నకు ఇద్దరం అన్నదమ్ములం వేర్వేరుగా ఉంటున్నాం. ఇలాంటి పార్టీకి అధికారం కట్టబెట్టినందుకు బాధగా ఉన్నది. రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు.

– అనిల్, మైల్వార్ గ్రామం, (బషీరాబాద్)

### లిస్టులో పేరు రాలేదు..



రేషన్ కార్డు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయడంతోపాటు ప్రజాపాలనలోనూ దరఖాస్తు చేసినా. దరఖాస్తులో భార్య, పిల్లల పేర్లు చేర్చాలని కోరినా. రేషన్ కార్డుల లిస్టులో పేరు రాలేదు. అధికారుల అర్హులుగా ఉన్న మమ్మల్ని ఎంపిక చేయకపోవడం బాధగా ఉన్నది.

– యూ అశోక్, దేవనోనిగూడెం గ్రామం, పూడూరు

### ఇచ్చిన హామీని నెరవేర్చాలి..



ఎన్నికలకు ముందు అర్హులందరికీ రేషన్‌కార్డులు ఇస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చి మరిచారు. రేషన్‌కార్డు ప్రజాపాలన, కుటుంబ సర్వేలో దరఖాస్తు చేసుకుంటే పేరు రాలేదు. మాకు సెంటు భూమి కూడా లేదు. హైదరాబాద్‌కు వెళ్లి కూలి పని చేస్తూ బతుకుతున్నం. రేషన్ కార్డు మంజూరు చేయాలి.

– వనిత. గృహిణి, ఆలేడ్, దుద్యాల మండలం (కొడంగల్)

# కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు..

- రుణమాఫీ కానీ రైతులకు మాఫీ చేయాలి
- రెండు విడుతలు రైతుబంధు ఎగ్గొట్టిన ఘనత రేవంత్‌రెడ్డికే దక్కుతుంది..
- బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో జనవరి 26 తర్వాత రైతుభరోసాపై ఉద్యమిస్తాం
- షాబాద్ మాజీ జడ్పీటీసీ జడల రాజేందర్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నక్క శ్రీనివాస్‌గౌడ్, పార్టీ మండలాధ్యక్షుడు నర్సింగ్‌రావు
- షాబాద్‌లో రుణమాఫీ కాని రైతులతో ర్యాలీ, అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేత

షాబాద్, జనవరి 20 : రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని షాబాద్ మాజీ జడ్పీటీసీ జడల రాజేందర్ గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నక్క శ్రీనివాస్‌గౌడ్, బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు గూడూరు నర్సింగ్‌రావు అన్నారు. సోమవారం షాబాద్ మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రుణమాఫీ కాని రైతులతో కలిసి ముంబయి–బెంగూళూరు లింకు జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. సీఎం డౌన్ డౌన్.. అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ రాజేందర్‌గౌడ్ మాట్లాడుతూ కుమ్మరిగూడ గ్రామానికి చెందిన జనమ్మకు రుణమాఫీ కాలేదని ఆమె రైతుధర్నాలో కేటీఆర్ దృష్టికి తీసుకొచ్చిందని, దీనిపై కాంగ్రెస్ నాయకులు ఏదేదో మాట్లాడడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ప్రజలకు, రైతులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రెండు విడుతలు పెట్టుబడి సాయాన్ని ఎగ్గొట్టిన ఘనత రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. 26 తర్వాత రైతుభరోసాపై పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని తెలిపారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నక్క శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు లేనిపోని ఆరోపణలు చేయడం వంటి చిల్లర చేష్టలు మానుకోవాలన్నారు. రుణాలు మాఫీ కాని ఎంతోమంది రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడూరు నర్సింగ్‌రావు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ రైతు ధర్నాకు జనాలు పెద్ద ఎత్తున రావడంతోనే కాంగ్రెస్ నాయకుల కడుపు మండుతున్నదన్నారు. రైతుల మీద ప్రేమ ఉంటే సీఎంతో మాట్లాడి రుణాలను మాఫీ చేయించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి చల్లా శ్రీరాంరెడ్డి, మాజీ సర్పంచులు పోనమోని కేతన, నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రాంచంద్రారెడ్డి, కృష్ణారెడ్డి, నర్సింహులు, చంద్రశేఖర్, దేవేందర్‌రెడ్డి, సహకార సంఘం డైరెక్టర్ పర్వేద నర్సింహులు, మాజీ ఎంపీటీసీ మంగలి సత్యం, నాయకులు పి. రమేశ్‌యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, బచ్చంగారి నారాయణరెడ్డి, గంగిడి భూపాల్‌రెడ్డి, మల్లేశ్, వెంకట్‌రెడ్డి, ముక్రంఖాన్, రాంచందర్, రాజేశ్వర్‌రెడ్డి, యాదిరెడ్డి, పురుషోత్తంచారి, అవిలాశ్‌గౌడ్, యాదయ్య, మహిళా రైతులు చెన్నమ్మ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.




షాబాద్‌లో రైతులందరికీ రుణమాఫీ చేయాలని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని అందజేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు